


అన్నయ్యా,

నీవు నా ఉత్తరం చూసి ఆశ్చర్యపోతావు. కలలో కూడ ఎన్నడూ అనుకోని ఒక విపరీత ఘటన జరిగిపోయినట్లుగా కంగారుపడతావు.

నా జీవితంలో ఇంతకుపూర్వం నేనెప్పుడూ ఉత్తరాలు రాయలేదు... కాని ఈనాడు, అసంభవమనుకున్న ఘటనలన్నీ జరిగిపోయిన తరువాత ఆపుకోలేని ఆవేదనతో నీకు నేనీ లెటరు రాస్తున్నాను.

అన్నా,

అందరు స్త్రీలలాగే నేనూ ప్రపంచానికి ఒక క్లిష్టసమస్యను-ఆడబిడ్డ కలిగితే తల్లిదండ్రుల నవనాడులూ కృంగి కండ్లు చీకట్లుకమ్మే సంఘంలో నేను పుట్టానని గుర్తుంచుకో అన్నయ్యా.

ఈవిషయం రాస్తూంటే నా కెందుకో చిన్ననాటి సంగతులు ఒక్కొక్కటే గుర్తొస్తున్నాయి. మనిద్దరం చాల రోజులవరకూ ఒకే స్కూలులో చదువుకున్నాం. కొంచెం పెద్దవాళ్లమయాక నువ్వు పెద్దచదువులకోసం కలకత్తా వెళ్లిపోయావు. కాని నేను స్త్రీని-ఎక్కువ చదువెల్లా చదువుతాను? ఇంట్లోనే పాకమహారాజ్యానికి పట్టమహిషి నయ్యాను.

నువ్వు నా కుత్తరం రాయవు- నేను నీకు రాయను. మన వంశంలో పెద్దలదగ్గరనుండి మనకు సంక్రమించిన కులమర్యాద మితభాషిత్వం. నువ్వూ, నేనూ, అక్కయ్యలూ, అమ్మ, నాన్న అందరం అదే పద్ధతిని అనుసరించాం. ఇంట్లో ఉన్నప్పుడు కూడ మనం ఒకరితో ఒకరం అట్టే మాట్లాడుకోం-దూరంగా ఉన్నప్పుడూ ఎక్కువగా ఉత్తరాలు రాసుకోం.

వంశగౌరవం నిలుపుకోడంకోసం మనలో ప్రతిఒక్కరం ఉరిపెట్టుకోడానికి కూడ సంసిద్ధులంగా ఉంటాం. ఆ గౌరవం ఎల్లాంటిది? తెలుచుకుంటే నవ్వొస్తుందిప్పుడు-స్త్రీజనాన్ని కాపలా కాసుకోటమే ఆ గౌరవంయొక్క ముఖ్యఉద్దేశ్యం! స్త్రీలు తమ్ము తాము కాపాడుకోలేరు! పెంపుడు జంతువులను కాపాడినట్లు వాళ్లను కాపాడాలి!

నీకూ కొంతవరకు ఈ భావాలే ఉన్నాయి. నీ భార్యను ఇతరులెవరూ చూడకుండా ఉండేందుకు తాపత్రయ పడతావు నువ్వు. ఇవన్నీ రాస్తూంటే నీకు కోపం కూడ వస్తుంది. నిన్ను అందరూ 'మగవాడు వాడికేం' అంటారు. నువ్వు చదువుకొని

ఉద్యోగం చేస్తావు. నీ భార్య నీకు అడ్డమైన చాకిరీచేస్తూ వంటవండి పెడుతుంది.

ఆవేగాన్ని ఆపుకోలేకపోతున్నాను—అక్కయ్యలిద్దరిగతీ ఏమైంది? వాళ్ళ జీవితాలావిధంగా కొరగాకుండా పోవడానికి బాధ్యులెవరు?—స్పష్టంగా కనిపిస్తోనే వుంది.

పెద్దక్కయ్య నిజంగా భూదేవిలాంటిది కాదూ? ఓర్పుకీ సహనశక్తికీ ఆమె పెట్టిందిపేరు. వంశమర్యాదకోసం కుటుంబగౌరవంకోసం ఆమెని ఒక కులపెద్దయొక్క వ్యర్థప్రతిష్ఠకి కట్టబెట్టారు—ఆ వ్యక్తి కులప్రతిష్ఠ ఎట్టిది? త్రాగుబోతుతనం-జూదరితనం-కసాయివానిలా అక్కయ్యని పట్టుకుని కొడుతూండటం! ఇంత చేసినా అక్కయ్య నోరు మెదిపి ఎరగదు. తన భర్త అభిజాత్యాన్ని చాటుకుంటూ తిరుగుతుంది. ఆమె కన్నీరు కార్చడం నేనెప్పుడూ చూచి ఎరగను. ఎంతో సంతోషంగా ఉన్నట్టు నటిస్తుంది. మన మెప్పుడేనా వాళ్ళ ఇంటికి వెడితే బావచర్యలు మన మెక్కడ కనిపెట్టిపోతామో అని కంగారుపడుతూ వుంటుంది. అక్కయ్యకి ఈ గుట్టూ మర్యాదా ఎవరు నేర్పారు? మన కులమర్యాదేకదా? కాని ఈ కృత్రిమ కులమర్యాదవలన ఆమె ఏమి సుఖం పొందకలిగింది? బావ అక్కయ్యను అల్లా పట్టుకుకొడుతూవుంటే నాకు వంటినిండా తేళ్లూ, జెర్రులూ పాకినట్టయేది. 'అదే నేనయితేనా'......అంతకంటె ఆనాటి నా చిన్ని హృదయం ఆలోచించలేకపోయింది. కాని...ఈరోజు నేనేమయాను?

తరువాత చిన్నక్కయ్యను కూడ ఆ త్రాగుబోతువాని తమ్మునికే కదూ ఇచ్చి అంటగట్టారు? చిన్నక్కయ్య సౌందర్యం, ముగ్ధత్వం ఎవ్వరిని ఆకర్షించవు? ఏమంత గొప్పసాంప్రదాయకమైనసంబంధం మించిపోతోందని అక్కయ్య నతని కిచ్చారు? అంత అసహ్యంగానూ వుండే చిన్నబావ బంగారుతీగెలాంటి అక్కయ్యకి చుట్టూ బానిసత్వమనే ఇనుపకంచె వేసేశాడు. ప్రేమ అంటే ఏమిటో తెలియని ఆ భర్త జీవితంలో చిన్నక్క కూడ భాగస్వామిని కావలసివచ్చింది. ఆయన చెప్పిందల్లా వేదవాక్కుగా పరిగణించడానికి ఆమె బాధ్యురాలైపోయింది.

సంఘం ఇద్దరి అక్కయ్యలమీదా సానుభూతి కనపరుస్తుంది. కులగౌరవాన్ని నిలబెట్టారని వారిని అభినందిస్తుంది. కాని ఈ శుష్కసానుభూతివల్ల ఏం లాభం?

అయితే ఇక మిగిలింది నేను—అందరిలో చిన్నదాన్ని— అక్కయ్యల మార్గాన్నే 'తుచ' తప్పకుండా అనుసరించవలసినదాన్ని. ఖర్మ చాలో చాలకనో అక్కయ్యలకంటె ఎక్కువ చదువుకొని ఉండటంవల్ల నన్ను గురించి నాకు ఎక్కువ తెలుసునేమో. అమ్మా నాన్నా అక్కయ్యలు—వీళ్లే నా జీవితసౌధానికి పునాదులు. ఇల్లూ ఇంట్లోని వ్యక్తులూ తప్పితే వేరే ప్రపంచం నాకు తెలియదు. బడికి మాత్రం వెళ్ళేదాన్ని. అప్పటి నా శరీరబలం చూసి మిగత పిల్లలంతా ఆశ్చర్యపోయేవారు. సిల్కు గౌను గాలికి టపటపా కొట్టుకుంటూవుండగా లేడిపిల్లలా పరుగెత్తుతూ వుంటే నన్నెవరూ పట్టుకోలేకపోయేవారు. నా కాళ్లలోని ఆనాటి పదునంతా ఏమైపోయింది ఈనాడు?

బడిలో నువ్వూ నేనూ ఒకే క్లాసు చదివేవాళ్ళం—కాని మన మెప్పుడూ ఒకళ్లతో నొకళ్లం మాట్లాడుకునేవాళ్ళం కాదు. నువ్వంటే నేను విపరీతంగా భయపడేదాన్ని. మన ఇంట్లో పెద్దవాళ్లు చిన్నవాళ్ళమీద, ఆ చిన్నవాళ్లు అంతకంటే చిన్నవాళ్లమీద అధికారం చలాయిస్తూండటం పరిపాటే కదా?

బడిపిల్లలంతా నాటకాలు వేస్తూంటే నువ్వూ వాళ్ళతోపాటు వేస్తూండేవాడవు. నాకూ వేషం వెయ్యాలని ఎంతో ఉత్సాహంగా ఉండేది. కాని నేను వెయ్యలేకపోయేదాన్ని. నువ్వు నాటకంలో అభినయం చేస్తూంటే నేను ఉత్సాహం పట్టలేకపోయేదాన్ని. నా అన్న చాలా గొప్పవాడని సంతోషించేదాన్ని, ఎంతో గర్వించేదాన్ని. ఈనాడైతే ఈర్ష్య కలిగేదేమో! ఇప్పుడవన్నీ తలుచుకుంటూంటే చాలా ఆవేదన కలుగుతోంది.

నువ్వూ నేనూ ఒకే తల్లిదండ్రులకి పుట్టాం. కాని మన జీవితాలలో ఎందుకింత వ్యత్యాసం ఏర్పడింది? నువ్వు మగ మహారాజువి - నేను ఆడదయ్యాన్ని!

ఆడవాళ్ళకి జ్ఞానం ఉండదని మీరంతా చాల ఈసడింపుగా చూస్తారు. అవును. ఎక్కడినుంచి వస్తుంది మాకా జ్ఞానం? ఇంటి నాలుగ్గోడలూ దాటి బయటికెప్పుడేనా వెళ్లే వీలుంటేకదూ మాకు? ఎంత చదువుకున్నా, మా బ్రతుకులు వృధా అయిపోయేట్లా చేశారు. లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తెచ్చుకునేందుకు కూడ మాకు అధికారంలేదు. అమ్మకీ నాన్నకీ భయం నాకు పెళ్లికాదేమోనని!

అన్నయ్యా,

నా బ్రతుకు ఎందుకిలా అయిపోయింది? నా అందమంతా అడవిగాసిన వెన్నెలైపోయిందెందుకని? నాయీ భగ్నజీవితానికి బాధ్యులెవ్వరు? నీకు నీవే అడ్డు అంటావు నువ్వు - ఎవరి జీవితసమస్యలకు వారే కర్తలని నీ ఉద్దేశ్యం. శుద్ధ పొరపాటు. స్త్రీ విషయంలో ఇట్టిఅభిప్రాయం ఈ రోజున ఎంతమాత్రం వద్దు.

పెళ్ళికాకముందు రోజూ అద్దంలో నేను నా రూపాన్ని చూసుకునేదాన్ని—ఎందుకో తెలుసా? నా స్నేహితులంతగా ప్రశంసించే, కావ్యనాయికాలక్షణాలతో కూడుకున్న నా సౌందర్యప్రభని కళ్ళార చూసుకోవాలని నా కెంతో అభిలాషగా ఉండేది. కోటేరులా చక్కగా ఉందని చెపుతూ స్నేహితులందరూ పట్టుకులాగే నాముక్కుతీరూ, సిగ్గునటించినప్పుడల్లా లేత కుంకుమరంగుతాల్చే నా చెక్కిళ్ళసొరూ, కమలంతో పోల్చబడే నా ముఖంలో విరిసే అందచందాలూ అద్దంలో చూసుకుంటూ స్నేహితుల ప్రశంసలలోని సత్యాసత్యాలిన్ని గ్రహించేందుకు నేను రోజూ ఎంతో ప్రయత్నించేదాన్ని.

కాని నేడవన్నీ ఏమయాయి? నా క్షుబ్ధజీవితంలో రేగే ఈ తుపాను - నా శూన్యనేత్రాల్లో ఇంకే ఈ కన్నీరు - ఇవేనా నాకీనాడు మిగిలినవి? నా కులమర్యాద నాకు చేసిన ఉపకారం ఇదేనా? ఇప్పుడు నా చెక్కిళ్ళు సిగ్గుతో ఎర్రపడటంలేదు - కన్నీటి చారికలతో మాసి మలినమవుతున్నాయి. నా పెదవు లిప్పుడు చీటికీ మాటికీ కంపిస్తున్నాయి. నా ముక్కు చివర మొద్దుబారిపోతోంది. నాముఖంలో బేలతనం వచ్చేసింది. ఈ శుష్కనేత్రాలలో నేడు కన్నీరుకూడ కరువైపోయింది.

నేను ఊహించుకున్న సుఖమయ కల్పనలు ఇసుకతో కట్టిన బొమ్మరిల్లుగా అయిపోయాయి నేను నిర్మించుకున్న ఆశాసౌధాలు గాలిమేడలుగా మారిపోయాయి. స్వప్నమయ దివ్యజగత్తులో స్వేచ్ఛావిహారం సల్పే నా హృదయవిహంగం రెక్కలు తెగిపోయాయి. నా జీవితం మరుభూమిగా మార్చబడి పచ్చిక పట్టనేదే లేకుండాపోయింది.

చదువుమాని నాలుగేళ్ళ ఇంట్లో ఉన్నాను. పదిహేడు సంవత్సరాలు వచ్చాయి. ఈ నాలుగేళ్ళపాటు అమ్మ, నాన్న నా పెళ్ళిసంబంధంకోసం వెతుకుతూనే ఉన్నారు. బహుశః నీవు కూడ ఆ ప్రయత్నం చేసేఉంటావు. అమ్మానాన్నా పెళ్లి బేరాలాడారు. పదివేలు ఇచ్చి అయినా సరే, పెళ్లికొడుకుని తెస్తామన్నారు. కాని పెళ్లికొడుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. బేరం కుదరలేదు. నా జీవితాన్ని అటో ఇటో తేల్చ

పారేయగల క్లిష్ట సమస్య - నన్నూ నా వాళ్ళనీ శాశ్వతంగా అగాధంలో త్రోసే యగల ఈ దారుణ సమస్య - ఇది తీరే దెప్పుడు?

నే నెందుకు పుట్టాలి? పుట్టి ఇంత మందిని కష్టసముద్రంలో ఎందుకు పడ త్రోయాలి? ఈ ఆలోచనలన్నీ నన్ను బాధిస్తూనే ఉన్నాయి. కాని నే నేం జెయ్యను?

ఆఖరికి నా జీవితం తొలకరిమబ్బులలో కలసిపోయేరోజులు రానేవచ్చాయి. నా పెళ్లి కాబోతున్నది. ఎవరితో? - ఒక అగాధశూన్యత్వంతో, అమ్మా నాన్నా ఎంతో సంతోషించారు. పెళ్ళికొడుక్కి ఆస్తి చాలా ఉంది. అయితే అతనికి విద్యా? శూన్యం. తెలివి తేటలా? పూజ్యం. సౌందర్యమా? నాస్తి. ఇంక మిగిలినది ఏమిటి? డబ్బుడబ్బు. ఈతో ఏం జేయాలి? పెళ్లికి నగలు చేయించుకోవచ్చు, విలువైన బట్టలు కొనుక్కోవచ్చు. నేను మహాగొప్ప దానినని సంతోషించవచ్చు.

నాకు కాబోయే భర్త గొప్పతనాన్ని గూర్చి నా కిదివరకే పరిచయముంది. ఆగుణ గణాలన్నీ చూసి ఒకప్పు డతనిని మూర్ఖ సత్తమునిగా కట్టి ఏడిపించినవాళ్ళలో నేనూ ఒకదానినే. ఈరోజు అతని కర్ధాంగిని కాబోతున్నాను.

అన్నా,

నేనీ వివాహం ఇష్టమయే చేసుకున్నా ననుకున్నావా? నేను నాస్థానంలోఉండే ఈ విపరీత వివాహాన్ని వ్యతిరేకించడానికి సాయశక్తులా ప్రయత్నించాను. నాన్న బల్ల గుద్దిప్రశ్నించాడు-"ఇంకా నే నెక్కడి నుండి సంబంధాలు తేను?" నా హృదయంలో ప్రళయ సముద్రఘోషలు ప్రతి ధ్వనించాయి. నాన్న ప్రశ్న కేమి జవాబివ్వను? ఆయన ముఖం చూడలేక అమ్మ చెంత తలదాచుకుని ఏడ్చాను.

నాదృష్టి కందినంతవరకూ నలువైపులా పరికించి చూశాను— చదువుకున్న వాళ్లని పెళ్లిచేసుకోవాలంటే కట్నాలు విపరీతంగా పొయ్యాలి. నాన్న భరించలేడు. పోనీ ఆస్తి సరిసమానంగా పంచి ఇవ్వగలడా అంటే, అందుకు మనస్సొప్పదు.

సుడిగుండంలో మునిగేందుకు తయారుగా వున్న ప్రాణిలా కళ్ళు మూసుకుని కర్తవ్యాన్ని పూర్తిగా విస్మరించాను. వివాహ ఘడియలు సమీపిస్తున్నాయి. విప్రుల వేదఘోషల మధ్య— మేళతాళాల గల్లంతులో కూర్చుని, ఇతని నేనా నేను వివాహమాడవలసింది? వీళ్లంతా కలిసి నన్నూ ఇతనినీ అగ్నిసాక్షిగా వివాహ బంధనంద్వారా విడరాని జంటగా తయారు చేస్తున్నారు—భవిష్యత్తులో నే నేమవుతాను? మూర్ఖుని భార్య మూర్ఖురాలేకదా? నా గతీ ఇంతేనా అన్నయ్యా?

నువ్వూ పెళ్లికొచ్చావు. నేను కనిపెడుతూనే వున్నాను. నా పెళ్లి చూడలేక నువ్వు బయటికి వెళ్లి కూర్చున్నావు.

నా వివాహం జరిగింది—నాజీవితంలో ఒక క్రొత్త అధ్యాయం ప్రారంభమవుతున్నది.

ఈ అధ్యాయంలో పున్నమినాటి వెన్నెలలు విరియబూయడం లేదు.

అమావాస్యనాటి చీకటితెరలు ఒక్కటొక్కటే క్రమ్ముకొస్తున్నాయి.

నీ చిట్టిచెల్లెలు

.........

★


# VASANT MAHAL

## ELURU.

### HIGH CLASS COFFEE & MEALS HOTEL.

All Preparations of Pure Ghee and by Expert Cooks.

**A visit will convince you.**

సమర్థులైన పనివారలచే వెన్నకాచిన నేతితో పరిశుభ్రముగా తయారుచేయబడిన భోజన, ఫలహారములకు నిలయము.

# —వసంత మహల్—

## కాఫీ, భోజన హోటల్—ఏలూరు.

ఒకసారి వచ్చిన మీకే తెలియగలదు.

ప్రొప్రైటర్:

# కలగర వెంకటరత్నం